14

# శ్రీశేషుదేవులలో మూడు దైవీశక్తులూ మేల్కొన్నవి.

శ్రీ శేషబాబుగారు తన దేహ, మనో, ఆత్మలను సంపూర్ణముగా తీవ్రముగా విమర్శించుకొనే వారు, అట్టి సాధన ఫలముగా శ్రీ శేషబాబుగారిలో ఆత్మవిమర్శ అనే దైవీశక్తి మేల్కొనినారు. తనలోని అణువణువునూ విమర్శించుకొనిన ఆయనకు ఆత్మవిమర్శ శక్తివలన తనకెదురైన ప్రతీవారి యొక్క దేహ, మనో, ఆత్మస్థితులు సంపూర్ణముగా అర్ధమయ్యేవి. ఏ వ్యక్తిలో ఎంత పెద్ద పాపము గోచరించినా గానీ, ఆత్మ విమర్శకుడైన శ్రీ శేషబాబు గారికి ఆ పాపస్వభావము అంతకంటే పెద్దస్థాయిలో తనలో కూడా ఉన్నట్లుగా గోచరించేది. అలాగే ఏ వ్యక్తి తనలోని పాపమును శ్రీ గురుదేవుల వద్ద బాప్తిస్మముగ చెప్పినా గానీ ఆ లోపము అంతకంటే పెద్ద స్థాయిలో తనలో కూడా ఉన్నట్లుగ ఆయనకు కనిపించేది. అందరికంటే తానే పాపినని, అల్పుడిననే భావమును అణువణువునా ఆయన కలిగియుండేవారు. కావున ఆయనకు ఎవ్వరిపైనా తక్కువభావము గానీ, ఆశ్చర్యముగానీ, అసహ్యము గానీ అణుమాత్రమైనా కలిగేవి కావు.

మహాభారతములోని ధర్మరాజుకు తనకంటే అల్పమైన వస్తువు మరొక్కటేదీ కనిపించలేదనే ఒక కథ ఉన్నది. అలాగే శ్రీ శేషబాబు గారు తనకు ఏ వ్యక్తి ఎదురైతే ఆ వ్యక్తికంటే తానే చిన్నవానిగ మారిపోయేవారు. ఆయన ఆ విధంగా నటించే వారు కాదు, నిజముగానే ఆ భావమునే ఆయన కలిగియుండేవారు. అందువలన శ్రీ గురుదేవులకు ఎంతటి పాపి ఎదురైనాగానీ అతనిపై జాలియే కలిగేది ప్రతి వ్యక్తిని చూచి జాలిపడుతూ ఉండేవారు. ప్రతివ్యక్తీ పాపఫలము నుండి విముక్తుడై సుఖశాంతులను పొందాలనే ఆతృత ఆయనలో పెరిగిపోయేది. అట్టి ఆతృతతో ఇతరుల పాపభారాన్ని ఆయన స్వీకరించి అశాంతిని అనుభవించేవారు. ప్రతి జీవిని చూచి జాలి పడుతున్న శ్రీ గురుదేవులలో జాలి అనే దైవీశక్తి కూడా మేల్కొన్నది. ఆత్మవిమర్శతో దేహ, మనో, ఆత్మలను సంపూర్ణముగా విమర్శించుకొనిన శ్రీ శేషబాబుగారు 'జీవితము అత్యల్పము, మరణము తథ్యము' అనే సత్యాన్ని తన దేహమునకు అన్వయించుకుంటూ ప్రతిక్షణము మరణమును స్మరిస్తూ, గుర్తించుకుంటూ ఉండేవారు. అట్టి మనోస్థితిలో ఉన్న ఆయనలో వైరాగ్యము అనే దైవీశక్తి మేల్కొన్నది. ఆత్మవిమర్శ, జాలి, వైరాగ్యము అనే మూడు దైవీశక్తులు శ్రీ గురుదేవులలో మేల్కొని శ్రీ శేషబాబు గారిని సద్గురువుగా చేసినవి. ఏ వ్యక్తియైనా ఆధ్యాత్మిక మార్గములో అనేక జన్మలు సాధన చేస్తేనే గానీ ఈ దైవీశక్తులలో ఏ ఒక్క శక్తినో తనలో మేల్కొల్పుకోలేరు. కానీ శ్రీ శేషబాబు గారు గత జన్మలోనే ఈ మూడు దైవీశక్తులు తనలో మేల్కొనియున్న సద్గురుస్థితిని కలిగియున్నవారగుట చేతనే ఈ జన్మలో ఆయనలో మూడు దైవీశక్తులు ఒకేసారి మేల్కొనుట సంభవించినది.

